క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాస్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దేవరపల్లి: యర్నగూడెం వద్ద బుధవారం రాత్రి 11 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యర్నగూడేనికి చెందిన దొడ్డి శ్రీనివాస్ (49) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. యర్నగూడెంకు చెందిన దొడ్డి శ్రీనివాస్ పెట్రోల్ బంకులో పెట్రోలు పోయించుకుని బైక్‌పై ఇంటికి వస్తూ మార్గమధ్యలో రోడ్డుపై నడిచి వెళుతున్న గ్రామానికి చెందిన దండే కేశవ్‌ను ఢీకొన్నాడు. ఆ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన కేశవ్‌ను చికిత్స నిమిత్తం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పోలీసు పహారా

పెరవలి: ముక్కామలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. వైఎస్సార్ సీపీ ముక్కామల ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణపైన, ఆయన కుమారుడు శేషువర్ధన్‌పైనా అదే గ్రామానికి చెందిన సుమారు 25 మంది టీడీపీ శ్రేణులు మంగళవారం ఉదయం మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఘర్షణలు జరిగే అవకాశం ఉండడంతో ముందుజాగ్రత్త చర్యగా పోలీసులు ఆ గ్రామ వీధుల్లో గస్తీ తిరుగుతున్నారు. గ్రామానికి చెందిన రెండు ప్రధాన పార్టీల నాయకుల మధ్య వైరం కావడంతో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. దాడికి పాల్పడిన టీడీపీ నాయకుల్లో ఆరుగురిని పెరవలి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. దాంతో ప్రస్తుతం ముక్కామలలో ప్రశాంత వాతావరణం నెలకొంది. వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ముక్కామల వచ్చి గాయపడిన గండేపల్లి రామకృష్ణను పరామర్శించారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

నిడదవోలు రూరల్: కష్టపడి పనిచేసే యువతకు వైఎస్సార్ సీపీలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. డి.ముప్పవరం గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అదే గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త మల్లిపూడి అభిషేక్ వైఎస్సార్ సీపీలో చేరారు. అభిషేక్‌కు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

తాళ్లపూడి: స్థానిక మదనగోపాల స్వామి గుడి వీధిలో బుధవారం రైస్ మిల్లుకు వచ్చిన లారీ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో వైర్లు తెగి, స్తంభం పడిపోయింది. ఆ సమయంలో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

బోసురాజును పరామర్శించిన మోషేన్‌రాజు



బోసురాజును పరామర్శిస్తున్న శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరుకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యుడు పేరిచెర్ల బోసురాజును రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు బుధవారం పరామర్శించారు. ఇటీవల బోసురాజు తల్లి స్వరాజ్యలక్ష్మి మృతి చెందారు. దీంతో ఆమె చిత్ర పటానికి మోషేన్‌రాజు పూలమాల వేసి నివాళి అర్పించారు.

నూతన కార్యవర్గ ప్రమాణం

పెరవలి: లయన్స్ క్లబ్ పెరవలి శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం సాయంత్రం స్థానిక దీపిక ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రెసిడెంట్‌గా కోలా సీతారామయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా ఆగర్తి సూర్య వెంకటకృష్ణారావు, సెక్రటరీగా మేడిచెర్ల భాస్కర శివకుమార్, ట్రెజరర్‌గా అడబాల సుబ్రహ్మణ్యం, మరో పది మంది కా ర్యవర్గ సభ్యులుగా గవర్నర్ ఎన్వీఎస్ పాపారావు నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు.

'మానవత' నూతన కార్యవర్గం ప్రమాణం

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ మండల శాఖ నూతన కార్యవర్గం ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య ఇంటి వద్ద ప్రమాణ స్వీకారం చేసింది. మండల శాఖ నూతన అధ్యక్షుడిగా ఈద్పుగంటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఆచంట సుభాష్‌చంద్రబోస్, కోశాధికారిగా తీగెల లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా కురిశెట్టి రామరాజు, సంయుక్త కార్యదర్శిగా పోతుల కాశీవిశ్వనాథం, ఈసీ ఎడ్యుకేషన్ సుతాపల్లి రామారావు, ఈసీ హెల్త్ పిన్నమనేని పాపారావు, ఈసీ అవేర్‌నెస్ నున్న శివరామకృష్ణ, ఈసీ ఎమర్జెన్సీ పచ్చా రాంగోపాల్ ప్రమాణ స్వీకారం చేశారు.

కౌలు రైతుకు సాగు భరోసా

- జగన్ ప్రభుత్వం హక్కు పత్రాల జారీ
- డివిజన్‌లో 33,810 సీసీఆర్‌సీ పంపిణీ లక్ష్యం
- ఇప్పటికే 22,369 కార్డుల పంపిణీ



కుమారదేవంలో కౌలు రైతుకు సీసీఆర్‌సీ అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత (ఫైల్)

కొవ్వూరు: రైతులకే కాదు.. కౌలుదారులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. భూమి హక్కుదారులకు మాదిరిగానే కౌలుదారులకు కూడా పంట రుణాలు, పంటల బీమా వంటివి వర్తింపజేస్తోంది. సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు సరఫరా చేస్తోంది. ఇందుకోసం కౌలుదారులకు పంట సాగు హక్కు పత్రం (సీసీఆర్‌సీ)అందిస్తోంది. ఆ కార్డు ద్వారా కౌలు వ్యవసాయం చేసే రైతులకు వివిధ రకాల లబ్ధి చేకూరుస్తోంది. ఇందుకోసం ఏపీ పంట సాగు హక్కు చట్టం –2019 రూపొందించింది. సెక్షన్ 3(2), 8 (ఏ) ప్రకారం 11 నెలల కాలపరిమితికి రెండు పంట సీజన్లలకు సరిపడేలా సీసీఆర్‌సీ జారీ చేస్తున్నారు. దీనినే క్రాప్ కల్టివేషన్ రైట్ సర్టిఫికెట్ (సీసీఆర్‌సీ) అని అంటారు. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో ఈ ఏడాది 33,810 సీసీఆర్‌సీలు అందించాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే డివిజన్‌లో 22,369 మందికి ఈ కార్డులు అందజేశారు. ఇప్పటివరకూ డివిజన్‌లో సరాసరి 66.16 శాతం పంపిణీ పూర్తయ్యింది. ఉండ్రాజవరం మండలంలో అత్యధికంగా 83.47 శాతం కౌలుదారులకు ఈ కార్డులను అందించారు. నిడదవోలు మండలం 75.29, తాళ్లపూడి మండలం 70.70 శాతాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మిగిలిన మండలాల్లో కూడా 50 శాతానికి పైగా కార్డులు జారీ చేశారు. ప్రస్తుతం గ్రామాలు, పురపాలక సంఘాల్లో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష శిబిరాల్లో కౌలుదారులకు సీసీఆర్‌సీలు పంపిణీ చేస్తున్నారు.

మండలాల వారీగా సీసీఆర్‌సీ జారీ ఇలా..

మండలం	లక్ష్యం	అందించినవి	శాతం
కొవ్వూరు	3,864	2,320	60.04
చాగల్లు	3,478	2,129	61.22
దేవరపల్లి	4,057	2,210	54.47
నల్లజర్ల	4,250	2,430	57.17
గోపాలపురం	3,478	2,307	66.34
పెరవలి	3,864	2,650	68.58
తాళ్లపూడి	2,898	2,049	70.70
నిడదవోలు	4,250	3,200	75.29
ఉండ్రాజవరం	3,671	3,064	83.47
మొత్తం	33,810	22,369	66.16

బోలెడు ప్రయోజనాలు



క్రాప్ కల్టివేషన్ రైట్ సర్టిఫికెట్ (సీసీఆర్‌సీ)

- ఈ కార్డు పొందిన కౌలుదారుడు తీసుకునే రూ.లక్ష లోపు పంట రుణాలకు సున్నా వడ్డీ వర్తిస్తుంది. అయితే తీసుకున్న రుణాన్ని ఏడాదిలోగా తిరిగి చెల్లించాలి. పంట రుణాలకు రైతులు చెల్లించాల్సిన మూడు శాతం వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. దీనినే కౌలుదారులకు కూడా వర్తింపజేశారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలుదారులకు రైతుభరోసా పథకాన్ని కూడా అందిస్తున్నారు. అయితే వరి సాగు చేసే కౌలుదారుడికి కనీసం ఎకరం పొలం ఉండాలి.
- రైతు తన పొలాన్ని ఎంత మందికి కౌలుకు ఇచ్చినప్పటికీ ఆయనతో పాటు కౌలుదారులకు కూడా రైతుభరోసా సాయం అందిస్తారు. ఇందుకు కులాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ముందుగా ఎస్టీ, తర్వాత ఎస్సీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు.
- వైఎస్సార్ యంత్రాసేవా పథకం ద్వారా అందించే వ్యవసాయ పనిముట్లు పొందేందుకు సీసీఆర్‌సీ ఉపకరిస్తుంది.
- ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ పొందే అవకాశం ఉంది.
- వాతావరణ ఆధారిత, దిగుబడి ఆధారంగా లెక్కించే వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా పంట నష్టపోయిన సందర్భంలో కౌలుదారులు బీమా సాయం పొందే అవకాశం ఉంది.
- బ్యాంకులు, సొసైటీల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణ సాయం పొందవచ్చు.
- రైతులతో పాటు విత్తనాలు, ఇతర ఇన్‌పుట్స్‌ను సబ్సిడీపై పొందవచ్చు.

సీసీఆర్‌సీ తీసుకోవాలి



కౌలుదారులు కచ్చితంగా క్రాప్ కల్టివేషన్ రైట్ సర్టిఫికెట్ (సీసీఆర్‌సీ) తీసుకోవాలి. తద్వారా ప్రభుత్వం నుంచి అన్ని రకాల రాయితీలు, పథకాల లబ్ధి పొందవచ్చు. సీసీఆర్‌సీ కోసం వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి దరఖాస్తులు తీసుకోవాలి. భూమి యాజమాని అంగీకార సంతకం చేయించి అప్పగిం చాలి. అర్హులైన కౌలుదారులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలి.

– సీహెచ్ చంద్రశేఖర్, వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు, కొవ్వూరు

నేటి జగనన్న సురక్షకు కలెక్టర్ మాధవీలత హాజరు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్ల, దేవరపల్లి, ద్వారకాతిరుమల మండలాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. నల్లజర్ల మండలం పోతవరంలో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ కె.మాధవీలత ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటలకు ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లి గ్రామ సచివాలయం వద్ద, 10.30 గంటలకు నల్లజర్ల మండలం పడమట చోడవరం గ్రామ సచివాలయం వద్ద, మధ్యాహ్నం 2.30 గంటలకు దేవరపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ సచివాలయం వద్ద, 3.30 గంటలకు బందపురం గ్రామ సచివాలయం వద్ద కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

జిల్లాలో 10,265 ఎకరాల్లో వరినాట్లు పూర్తి



నల్లజర్లలో వరినాట్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 10,265 ఎకరాల్లో వరినాట్లు పూర్తయినట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు. కొవ్వూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో బుధవారం తాను పర్యటించి పచ్చిరొట్ట పైర్లు, వరి నాట్లను పరిశీలించినట్టు తెలిపారు. ప్రధానంగా కొవ్వూరు, నిడదవోలు, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో పచ్చిరొట్ట సాగును పరిశీలించినట్టు చెప్పారు. భూసారాన్ని పెంచేందుకు ఇటీవల రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు అందించామన్నారు. వాటి వినియోగంపై బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్టు తెలిపారు. కొవ్వూరు, నిడదవోలు మండలాల్లో అత్యధికంగా 13 శాతం, పెరవలిలో 11 శాతం వరినాట్లు పూర్తి చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు శాతం ఆయకట్టులో నాట్లు పూర్తయినట్టు మాధవరావు తెలిపారు. కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, టెక్నికల్ ఏవో కె.శివశ్రీనివాస్‌లు ఆయన వెంట ఉన్నారు.

వరినాట్ల పరిశీలన

నల్లజర్ల: నల్లజర్లలో వేస్తున్న వరినాట్లను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు బుధవారం పరిశీలించారు.రైతు జాలపర్తి దుర్గారావు పొలంలో జరుగుతున్న వరినాట్లు, నారుమళ్లను ఆయన పరిశీలించారు. ఏఓ కమల్‌రాజ్, ఏఈఓ పుష్పలత ఆయన వెంట ఉన్నారు.

త్వరగా ఆర్‌బీకే నిర్మాణం పూర్తి చేయాలి

నిడదవోలు రూరల్: రైతుభరోసా కేంద్రం భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని తాడిమళ్లలో నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే భవనాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. భవనాన్ని నాణ్యంగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఏఓ జి.సత్యనారాయణ, అధికారులు ఉన్నారు.

'నాడు-నేడు' పనుల నాణ్యతకు సహకరించండి



తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ మాధవీలత

- ప్రజలకు కలెక్టర్ మాధవీలత సూచన
- మల్లేశ్వరం నంబర్–2 ప్రాథమిక పాఠశాల సందర్శన
- హాజరైన డీఈఓ అబ్రహం తదితరులు

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం 'నాడు-నేడు' పథకం ద్వారా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యంగా జరిగేలా స్థానికులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత సూచించారు. మండలంలోని మల్లేశ్వరం నంబర్–2 ప్రాథమిక పాఠశాలను బుధవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెతో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రస్తుత పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టే బదులు నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ స్థలాన్ని సేకరిస్తే నూతన భవనానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులతో ముచ్చట్లు

అనంతరం కలెక్టర్ కె.మాధవీలత పాఠశాల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. వచ్చే సోమవారం నుంచి విద్యార్థులందరూ ప్రభుత్వం అందించిన యూనిఫాంలో పాఠశాలకు రావాలని ఆమె సూచించగా, అందుకు వారు అంగీకరించారు. మధ్యాహ్న భోజనంలో రాగి జావ, కోడిగుడ్డు ఇస్తున్నారా? భోజనం ఇంటి వద్ద బాగుందా? స్కూల్లో బాగుందా? అని కలెక్టర్ ప్రశ్నించారు. మెనూ ప్రకారం రాగిజావ, కోడిగుడ్డు ఇస్తున్నారని, స్కూల్లో భోజనమే బాగుందని పిల్లలు ఆనందంగా సమాధానం చెప్పారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఈ సందర్భంగా వెంట ఉన్న అధికారులను ఆమె ఆదేశించారు. బాగా చదువుకుని ఏమవుతారని అనంతరం కలెక్టర్ విద్యార్థులను ప్రశ్నించారు. డాక్టర్, పోలీస్, టీచర్, కలెక్టర్ అవుతామంటూ పలువురు సమాధానం చెప్పడంతో మాధవీలత వారికి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంఈఓ బి.బాల సుబ్రహ్మణ్యం, సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈ-ఆటోలతో మెరుగైన పారిశుధ్యం

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు మునిసిపాలిటీలో జెండా ఊపి ప్రారంభం



ఈ-ఆటోలను ప్రారంభిస్తున్న హోం మంత్రి వనిత, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

కొవ్వూరు: పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు, తడిపొడి చెత్తలను వేరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ-ఆటోలను సమకూర్చిందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు మునిసిపాలిటీకి వచ్చిన పది ఎలక్ట్రిక్ చార్జింగ్ ఈ-ఆటోలను బుధవారం మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. జగనన్న సంకల్పంలో భాగంగా కేటాయించిన ఈ ఆటోలను సద్వినియోగ పరుచుకుని పట్టణంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు ఆమె సూచించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ , మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారిలతో కలిసి మంత్రి కొద్దిసేపు ఈ-ఆటో ఎక్కారు. ఆటోలకు అమర్చిన సీసీ కెమెరా, మైక్‌లను పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించేందుకు వీలుగా ఆటోలో ఏర్పాటు చేసిన కంపార్ట్‌మెంట్లను కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం లాంఛనంగా ఆమె జెండా ఊపి ఆటోలను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కమిషనర్ బి.శ్రీకాంత్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, కౌన్సిలర్లు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, రుత్తల భాస్కరరావు, బత్తి నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న పాల్గొన్నారు.

నియోజకవర్గానికి అత్యధిక తాగునీటి నిధులు

- జల్‌జీవన్ మిషన్ కింద రూ.78.19 కోట్లు
- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పనులకు తాడిమళ్లలో శంకుస్థాపన



తాడిమళ్లలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ శంకుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: తాగునీటి సమస్య పరిష్కారానికి రాష్ట్రంలోనే అత్యధిక నిధులు రూ.78.19 కోట్లు జల్‌జీవన్ మిషన్ ద్వారా నిడదవోలు నియోజకవర్గానికి మంజూరయ్యాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. ఈ నిధుల్లో రూ.73.45 లక్షల వ్యయంతో మండలంలోని తాడిమళ్ల గ్రామంలో నిర్మించే 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌కు, తాగునీటి కుళాయిలు, పైపులైన్ పనులకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు సెంటు భూము కూడా ఇవ్వలేదన్నారు. మాజీ సీఎం వైఎస్సార్ హయంలో, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు ఇళ్ల స్థలాలు అందించడంతో పాటు పేదల సొంతింటి కలను నెరవేర్చారన్నారు. ఆ కాలనీల్లో తాగునీటితో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. తాడిమళ్లలోని ఇందిరమ్మ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్లు పూర్తిచేశామని, మరో ఆరు నెలల్లోనే తాగునీటి కొరత లేకుండా చేస్తామన్నారు. అనంతరం స్థానిక మహిళల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

మసీదుకు శంకుస్థాపన

ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. తాడిమళ్ల గ్రామంలో ముస్లింలు, దాతల సహకారంతో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించే మసీదు భవనానికి ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. మసీదు నిర్మాణానికి తన వంతు తోడ్పాటు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ బయ్యే రాధారాణి, ఉప సర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, ఎంపీడీఓ పి.శామ్యేలు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.శ్రీనివాస్ బాబు, ఏఈ కె.శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే వజీరుద్దీన్, ముస్లిం పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- డి.ముప్పవరంలో గడప గడపకూ..

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని డి.ముప్పవరం గ్రామంలో ఆయన బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రజలకు అందించి లబ్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగన్ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామానికి చెందిన 105 ఏళ్ల వృద్ధురాలు మారిశెట్టి సత్తెమ్మను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు సంగినీడి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

చాగల్లు: మండలంలో దారవరం, కలవలపల్లి గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు.బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యురాలు పీఆర్ఎల్ దేవి దారవరం గ్రామంలో 45 మందికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే కలవలపల్లిలో ఆ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సౌజన్య 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

CHANGE OF NAME

I, Vendra Venkata Satyanarayana, S/o. Vendra Narasimhamurthy, R/o. Door No.247, Kadimpadu, Peravali Mandal-534330, E.G.Dist., A.P. I inform you that my name in Passport No.J1287398 My name Yandra Venkata Satyanarayana (old name) is wrongly mentioned. But all transactions from today will be done on Vendra Venkata Satyanarayana.

పేదల ఆర్థిక స్థితి మెరుగుపడేలా పథకాలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- నిడదవోలులో 606 మందికి ధ్రువీకరణ పత్రాల పంపిణీ



నిడదవోలులో మహిళకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



నల్లజర్ల జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నిడదవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, ఆర్థికంగా వారు నిలదొక్కుకునేందుకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని 01, 28 వార్డుల్లో బుధవారం చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ పేదలను ఓట్లు వేసేవారిలా ముఖ్యమంత్రి చూడడం లేదన్నారు. సమాజంలో వారి గౌరవం పెరిగేలా అనేక పథకాల ద్వారా మేలు చేస్తున్నారన్నారు. వార్డుల్లో ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే వలంటీర్ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. గత టీడీపీ మాజీ ఎమ్మెల్యే శేషారావు కనీసం వృద్ధాప్య ఫించను కోసం కూడా ఇంటి చుట్టూ తిప్పించుకునేవారని గుర్తు చేశారు. అనంతరం అర్హులైన 606 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే చాన్‌బాషా, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, ఎస్‌కే వజీరుద్దీన్, ఆకుల ముకుందరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, పువ్వల రతీదేవి, దాకే అనిల్‌కుమార్, అహ్మదున్నీసా బేగం పాల్గొన్నారు.

అర్హులకు నూరు శాతం పథకాలు లక్ష్యం

నల్లజర్ల: అర్హులకు నూరు శాతం సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నల్లజర్ల, తూర్పుచోడవరం గ్రామాల్లో నిర్వహించిన బుధవారం ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అవినీతి, సిఫార్సులకు తావు లేకుండా సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం నల్లజర్ల–1 సచివాలయంలో 337, తూర్పుచోడవరంలో 758 దరఖాస్తులు వచ్చాయి. వారందరికీ వివిధ రకాల ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ని వెంకటలక్ష్మి, తూర్పుచోడవరంలో ఎంపీటీసీ సభ్యురాలు చోడసాని సునీత, స్థానిక నాయకులు గన్నమని సుబ్బారావు, భోగవల్లి శ్రీరామారావు, మద్దిపాటి శ్రీను, ఎంపీడీఓ రాజశేఖరం, తహసీల్దార్ కిశోర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, బంక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com